ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం జిల్లా వార్తలు

8 మంగళవారం 23 జనవరి 2024

పల్లె ప్రగతికి ప్రణాళికలు

- పంచాయతీల వారీగా వివరాలు సేకరిస్తున్న అధికారులు
- 27వరకు గ్రామ సభలు పూర్తి
- 31వరకు వివరాల నమోదు పూర్తి



వాంకిడిలో నిర్వహించిన గ్రామసభ (ఫైల్)

> పట్టణాలు ఎంతగా అభివృద్ధి చెందినా .. గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని నిధులు వెచ్చించినా.. పథకాలు తీసుకు వచ్చినా ప్రయోజనం నామమాత్రంగానే ఉంటోంది. దేశాభి వృద్ధికి గ్రామీణ పేదరికమే అవరోధంగా మారుతోంది. పల్లెలు ప్రగతి దిశలో పయనించాలంటే సరైన ప్రణాళిక ఉండాలి. ప్రభుత్వం ఇదే దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు చర్యలు తీసుకుంటోంది. - వాంకిడి

జాతీయ ప్రజాప్రణాళిక కార్యక్రమం కింద 2024-25ఆర్థిక సంవత్సరానికి గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిం చాలని ప్రభుత్వం ఆదేశించింది. పల్లెల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ఈనెల27లోగా గ్రామసభలు నిర్వ హించి వాటిని ఆమోదించాల్సి ఉంది. జిల్లాలోని 15 మండలాల్లో 335పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు.

నివేదికలు కీలకం..

గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులే కీలకం. అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన వీరి నేతృత్వం లోనే కొనసాగుతుంది. కార్యదర్శులే గ్రామానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అభివృద్ధి నివేదికలను రూపొందిస్తారు.

2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయాశాఖల ద్వారా గ్రామ స్థాయిలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన తీరుపై ప్రగతి నివేదికలు తయారు చేస్తున్నారు. 2024-25 సంవత్సరానికి అభివృద్ధికి గ్రామస్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 27వరకు పల్లెల్లో గ్రామసభలు పూర్తిచేసి చేపట్టాల్సిన పనులకు తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఈనెల31 నాటికి ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

పథకాల సద్వినియోగం.. జీవనోపాధుల పెంపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామస్థాయిలో పలు పథకాలు అమలు చేస్తున్నాయి. అర్హులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సత్ఫలితాలు ఉంటాయి. ప్రస్తుతం తయారు చేసే ప్రణాళికలో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఉపాధి హామీ పథకంలో అర్హులందరూ నమోదయ్యారా? లేదా? ఆసరా పథకం ద్వారా పింఛన్లు అందుతున్న తీరుపై నివేదికలు రూపొందిస్తారు. గ్రామీణ జీవనోపాధుల పెంపునకు ఉన్న మార్గాలను సూచిస్తారు. వ్యవసాయం, పాడిపరిశ్రమ, కుటీర పరిశ్రమలకు అవకాశాలను నివేదికలో పొందుపరుస్తారు.

పక్కాగా రూపొందిచేందుకు చర్యలు

ఇన్‌చార్జి ఎంపీడీవో శివకుమార్



గ్రామాభివృద్ధి ప్రణాళికలను పక్కాగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాం. గ్రామీణాభివృద్ధిలో అన్ని శాఖలను భాగస్వామ్యం చేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

గణతంత్ర దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్‌బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 22: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర హేమంత్ బోర్కడే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్‌లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని, గణతంత్ర దినోత్సవాన్ని సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు సురేష్, కె.సురేష్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్లకుండా చర్యలు: ఎస్పీ

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 22: వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లకుండా చర్యలు తీసుకుంటమని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో జరిగిన రోడ్డుప్రమాద స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాంగ్‌రూట్‌లను వెంటనే మూసివేసి ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా చూడాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. వాహనదారులు రాంగ్‌రూట్‌లో రాకుండా ఇక ముందు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వాహనదారులు ఎల్లప్పుడూ ట్రాఫిక్‌నిబంధనలు పాటించాలని సూచించారు. ఎస్పీవెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్



ఉత్పత్తి, ఉత్పాదకతలో ఓసీపీ ముందంజ



లోడర్‌ను ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జనవరి 22: ఉత్పత్తి, ఉత్పాతదకతలో ఓసీపీ ముందంజలో ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిఅవసరాల నిమిత్తం 6.4క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగి, రూ.5.3 కోట్లతో కొనుగోలుచేసిన లోడర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ఓసీపీ ఉద్యోగులు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణలో ముందుంటారని కొనియాడారు. దీనికికారణం మంచిపారిశ్రామిక సంబంధాలు కలిగి ఉండడం అని పేర్కొన్నారు. గనుల అవసరాల నిమిత్తం అవసరమైన యంత్రసామగ్రిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతు న్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓసీపీ పీవో వి పురుషోత్తమరెడ్డి, ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏరియాఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్‌కార్యదర్శి సత్తయ్య, ఇంజనీర్లు చంద్రశేఖర్, శ్యాంసుందర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అందుబాటులో సీఎండీ



సమస్యలు వింటున్న సీఎండీ

మందమర్రి టౌన్, జనవరి 22 : సింగరేణి సంస్థకు సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ బలరాం ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. గత సీఎండీలకన్నా భిన్నంగా బలరాం ప్రత్యేకముద్ర వేస్తున్నారు. ఆయనబాధ్యతలు స్వీకరించి నెలరోజులు కావస్తున్న నేపథ్యంలో సంస్థలో ఉద్యోగులసంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రగతిపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఆయా సమస్యలతో సతమతమవుతున్న వారు నేరుగా సీఎండీకార్యాలయానికి వెళ్లివినతులు అందజేస్తున్నారు. వారిసమస్యను వింటూ వినతులను స్వీకరిస్తున్నారు. సామాన్యుల సమస్యలను వినడానికి కొంత సమయం కేటాయిండంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నూతన గనులపై దృష్టిసారించగా వాటిఏర్పాటుపై ఆయన చొరవ చూపుతున్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, జనవరి 22: సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం వారు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగులకు కోల్‌మైన్స్ పెన్షన్‌ను పెంచాలని తదితర డిమాండ్లు చేశారు. అనంతరం సీఎండీ ఎన్ బలరాంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అళవందార్ వేణుమాధవ్, కె బీరయ్య, ఎస్ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జనవరి 22: ఈనెల 26న నస్పూర్‌కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి కోరారు. సోమవారం స్టేడియంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు ప్రాక్టికల్ పరీక్షలు

శ్రీరాంపూర్, జనవరి 22: సింగరేణి ఉద్యోగులకు పదోన్నతుల కోసం ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. టెండాల్, టెండాల్ సూపర్‌వైజర్, కార్పెంటర్, బిట్‌షార్ప్‌నర్ ప్రమోషన్లకోసం అంతర్గత అభ్యర్థులకు పరీక్షలు ఏర్పాటుచేశారు. ప్రతిభచూపిన వారికి పదోన్నతులు కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బొగ్గు బావులపై బాలరాముడికి పూజలు

మందమర్రి టౌన్, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ పూజల సందర్భంగా ఏరియాలోని కేకే5 గనిపై సోమవారం పూజలు నిర్వహించారు. ఈపూజల్లో గని అధికారులు, కార్మికసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు మాట్లాడుతూ ప్రజల చిరకాల వాంఛను మోదీప్రభుత్వం నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో గనిమేనేజర్ భూశంకరయ్య, రక్షణాధికారిరమేష్, అసిస్టెంట్‌మేనేజర్‌జశ్వంత్,నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్య రాముడి శోభాయాత్ర

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే7గనిపై సోమవారం అయోధ్య రాముడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శ్రీ మద్భగవద్గీత సత్సంగం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామి ఉత్సవమూర్తులను గని గేట్ నుంచి మైసమ్మ గుడి వరకు ఊరేగించారు. శ్రీరామ నామ ఉచ్ఛారణతో పాటు కోలాటాలతో మహిళలుఆకట్టుకున్నారు. ఆర్కే6 భక్తాంజనేయస్వామి ఆలయంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తులతోపాటు బీజేపీజిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తిలకించారు.



కాగజ్‌నగర్‌లో శోభాయాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



బెజ్జూరులో భక్తుల ర్యాలీ



ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, భక్తుల పూజలు

అంతా రామమయం..

- రామ నామస్మరణతో మార్మోగిన పట్టణం, మండలాలు, గ్రామాలు
- వెల్లువెత్తిన భక్తిభావం
- ఊరూవాడా సంబరాలు

ఆసిఫాబాద్ రూరల్/బెజ్జూరు /చింతల మానేపల్లి/ పెంచికలపేట/ దహెగాం/ తిర్యాణి/ వాంకిడి/ లింగాపూర్/ జైనూరు/ కెరమెరి/ సిర్పూర్(యు)/ కౌటాల/ సిర్పూర్(టి), జనవరి 22: జిల్లావ్యాప్తంగా సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. జిల్లాకేంద్రం, మండల కేంద్రాలతో పాటు గ్రామాలు రామనామస్మరణతో హోరెత్తాయి. ఆలయాల్లో ప్రత్యేకస్క్రీన్లపై అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రజలు భక్తిభావంతో వీక్షించారు. పూజలు, క్షీరాభిషేకాలు, యజ్ఞాలు, అన్నదానాలు, హోమాలు నిర్వహించారు. ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో జెండాలు, బ్యానర్లు వెలిశాయి. గ్రామాలను, వీధులను, ఇళ్లను మామిడి తోరణాలతో అలం కరించారు. ఇళ్లముందు రంగురంగుల రంగవల్లుల వేశారు. సాయంత్రం వేళ ఇళ్ల ముందు దీపాలు వెలిగించి తమ భక్తిని చాటారు. తిర్యాణి మండలంలోని ఎదులపాడు గ్రామానికి చెందిన ఆత్రం సచిన్ గ్రామం నుంచి అయోధ్యకు సైకిల్‌పై బయలుదేరాడు. అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

ఆసిఫాబాద్‌జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు సిద్ధంశెట్టి సుహాసిని పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. బ్రాహ్మణవాడలోని భక్తులు ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు, దస్నాపూర్ గ్రామస్తులు హిందూవాహిని ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో రామాలయానికి చేరుకున్నారు.

కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్‌మార్కెట్ ఏరియాలోని వ్యాపార సంస్థల యజమానులు, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రభారి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ, శోభాయాత్ర కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, చిన్నారులు భక్తిపాటలపై డ్యాన్సులు చేశారు. పట్టణమంతా కాషాయ జెండాలు కట్టారు. వయోభేదం లేకుండా ర్యాలీల్లో పాల్గొని రామనామస్మరణ చేశారు. బాలాజీనగర్‌లో గురుస్వాముల ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర నిర్మాణంలో కరసేవకులుగా పోరాడి వీరమరణం పొందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. రాజీవ్ గాంధీ చౌరస్తాలో మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మనీషా పోలెండ్‌లో ఉన్నత చదువులు చదువుతూ అయోధ్యకు రాముడు వస్తున్నట్లు చిత్రం గీసి తనభక్తిని చాటుకుంది. దీనిని ఆమె తన ట్విటర్ ఖాతాలో షేర్ చేసింది.

బందోబస్తును పరిశీలించిన ఎస్పీ

రెబ్బెన: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పట్టణంలో బందోబస్తును సోమవారం ఎస్పీ సురేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



బెజ్జూరులో మహిళల శోభాయాత్ర



ఆసిఫాబాద్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న భక్తులు



పెంచికలపేటలో హోమం కాలుస్తున్న భక్తులు



దహెగాంలో భక్తుల శోభాయాత్ర



చింతలమానేపల్లిలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న భక్తులు



దహెగాంలో కోలాటం ఆడుతున్న మహిళలు



జైనూరు మండలం జామ్నిలో భక్తుల భజన



రెబ్బెనలో బందోబస్తు ఏర్పాట్లను తెలుసుకుంటున్న ఎస్పీ సురేష్‌కుమార్



సిర్పూర్(యు)లో శ్రీరాముని పల్లకీ ఊరేగింపు



వాంకిడిలో భక్తుల శోభాయాత్ర



కెరమెరిలో కళశాలతో శోభాయాత్ర



కాగజ్‌నగర్ హనుమాన్ ఆలయంలో భక్తులు



వాంకిడిలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న మహిళలు



కాగజ్‌నగర్‌లో విగ్రహ ప్రతిష్ఠను స్క్రీన్‌లో వీక్షిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్



కౌటాలలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న గ్రామస్థులు

నేడు కేడీసీలో
అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టులో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ఎంసీహెచ్‌లో బాలిక ప్రసవం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 22: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో సోమవారం బాలిక ప్రసవించిన సంఘటన వెలుగులోకి పోలీసులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. వచ్చింది. మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బాబుకు జన్మనివ్వగా తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

అగ్ని ప్రమాదంలో సెలూన్ షాపు దగ్ధం

మందమర్రిటౌన్, జనవరి 22: పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో గల ఆలెక్స్ హెయిర్ సెలూన్ షాపులో సోమవారం రాత్రి 7 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. సాయంత్రం షాపులో ఉన్న దేవుళ్ల ఫొటోల వద్ద దీపాలు వెలిగించి యజమానికి బయటకువెళ్లాడు. ఎలుకలు దీపాలను పడేయడంతోనే అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. షాపులో నుంచి పొగలు రావడంతో యజమానికి సుధాకర్‌కు స్థానికులు సమాచారం అందించారు. షెట్టర్ తెరిచి చూడగా ఫర్నీచర్ కాలిపోతుండడంతో మంటలను ఆర్పివేశారు. ఫర్నీచర్, వస్తువులు, ఏసీ, టీవీ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 8 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని సుధాకర్ తెలిపాడు. బెల్లంపల్లి ఫైరింజన్‌కు యజమాని ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చే సరికే మంటలను ఆర్పివేశారు.

జాతీయ స్థాయి హ్యాండ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



ఏసీసీ, జనవరి 22: జూనియర్ బాలికల జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు నుంచి ముగ్గురు క్రీడాకారిణీలు సత్యభామ, అంజలి, అనితలు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేష్‌లు క్రీడాకారులను అభినందించారు. ఈ నెల 27 నుంచి 31 వరకు బీహార్ రాష్ట్రంలోని సరేన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారిణీలను డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, గిరిజన పాఠశాలల క్రీడల అధికారి మీనారెడ్డి, సాంబశివరావులు అభినందించారు. అసోసియేషన్ కోశాధికారి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ జాతీయస్థాయి క్రీడాకారిణి తుమ్రామ్ సత్యభామను న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని మోదీ ఆహ్వానం పంపారు. సోమవారం ఆహ్వానం అందుకున్న ఆమెను జిల్లా కేంద్రంలో అభినందించారు. కెరమెరికి చెందిన సత్యబామ గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని నుంచి ఆహ్వానం అందుకోవడం ఉమ్మడి జిల్లాకే గర్వకారణమన్నారు.

ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 22 : ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచిఆర్జీలు స్వీకరించారు. కాసిపేట, మంచిర్యాల, లక్సెట్టిపేట, జైపూర్, చెన్నూరు, దుగ్నేపల్లి, తదితర ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో మన జిల్లాకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వెంటనే జవాబు ఇచ్చి అర్జీదారులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను వచ్చే ప్రజావాణిలో పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని సబ్ స్టేషన్ దాటినతర్వాత క్రషర్ ఏర్పాటు చేశారని, దీంతో ఇండ్లలోకి దుమ్ము చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదు అందిందన్నారు. ఏపీవో గంగాభవానీ, ఏఈపీఆర్ శివ తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మయ్య ప్రజావాణి నిర్వహించారు. ఒక్క దరఖాస్తు రాలేదని తెలిపారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ గోవింద్‌నాయక్, ఏపీవో సత్యప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాసిపేట, జనవరి 22: ప్రత్యేక ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కలిగించేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విజేతలు ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఏఆర్ వీ రమణారెడ్డి, అరుణకుమారి, చిన్నయ్య, పాల్గొన్నారు.

ఉత్తమ అధికారిగా సంపత్ రెడ్డి



సంపత్ రెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 22 : శ్రీరాంపూర్ ఏరియా ఉత్తమ అధికారిగా ఎన్నపురెడ్డి సంపత్ రెడ్డి ఎన్నికయ్యారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల నుంచి ఉత్తమ అధికారులను ఎంపిక చేయగా, శ్రీరాంపూర్ ఏరియా నుంచి సంపత్ రెడ్డి ఎన్నికయ్యారు. మైనింగ్ డిప్లొమా అనంతరం సింగరేణిలో ఉద్యోగం పొందిన ఆయన ప్రస్తుతం శ్రీరాంపూర్ ఉపరితల గని (ఓసీపీ)లో డిప్యూటీ సూపరింటెండెంట్ సర్వే ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 26న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఉత్తమ అధికారిగా సంపత్ రెడ్డి సన్మానం పొందనున్నారు.

నిరుపయోగంగా స్వీపింగ్ యంత్రం

రూ.44 లక్షలతో కొనుగోలు ● డ్రైవర్ లేక మూలన పడిన వాహనం



మూలన పడిఉన్న స్వీపింగ్ యంత్రం

నస్పూర్, జనవరి 22: నస్పూర్ మున్సిపాలిటీలో రోడ్లపై ఉన్న ఇసుక, దుమ్ముధూళిని తొలగించి రోడ్లను శుభ్రం చేయడానికి కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం నిరుపయోగంగా మారింది. జూలై 5, 2023న యంత్రాన్ని పట్టణ ప్రగతి నిధులు రూ.44.15 లక్షలతో కొనుగోలు చేశారు. సీసీసీ కార్నర్ వద్ద దీనిని ప్రారంభించిన రోజునే వీల్ విరిగిపోయింది. యంత్రాన్ని నడిపే డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో మూలన పడేశారు. అప్పటి నుంచి స్వీపింగ్ యంత్రం శ్రీరాంపూర్ కాలనీలోని సింగాపూర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మూలన పడి ఉన్నది. దీనిని మరమ్మతు చేసే ప్రయత్నాలు అధికార యంత్రాంగం, పాలక వర్గం శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలున్నాయి. యంత్రాలను కొనుగోలు చేసామా.. కమీషన్ వచ్చిందా..? అనే విషయాలే తప్ప యంత్రాల నిర్వహణపై శ్రద్ధ లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమీషన్ల కక్కుర్తితో మున్సిపాలిటీ నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారనే విమర్శలున్నాయి.

తొళ్లవాగు నుంచి శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం మధ్య గల జాతీయ రహదారిపై ఇరువైపుల ఇసుక మెట్టలు పేరుకుపోయి వాహనదారుల కళ్ళలో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాదారులు అదుపు తప్పి కిందపడిపోతున్నారు. అధికారులు స్పందించి స్వీపింగ్ యంత్రం పనికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌ను సంప్రదించగా డ్రైవర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాం.

అంబులెన్స్ సౌకర్యం కల్పించడం గొప్ప విషయం



సేవా సమితి అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఏసీపీ

బెల్లంపల్లి, జనవరి 22: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం అంబులెన్స్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ఏసీపీ సదయ్య అన్నారు. సోమవారం కాల్‌టెక్స్ ఏరియాలో అంబులెన్స్‌ను టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రజల కోసం అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆపదలో ఉన్న వారికి అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సేవా సమితి అధ్యక్షుడు ఉమా మహేశ్వర్‌రెడ్డి, కొండయ్యలను సన్మానించారు. ఏసీపీని, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌ను సేవా సమితిసభ్యులు సన్మానించారు. నాయకులు గోపి కిషన్ సింగ్, గట్టయ్య, సలీం, నరేష్, శ్రీనాథ్, సురేష్, రవి, షకీల్, ముజీద్, ఇమ్రాన్, పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



డిప్యూటీ సీఎంకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు

కాసిపేట, జనవరి 22 : అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాపాట్ శంకర్ సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెలలో సర్పంచుల కాలం ముగియనుండడంతో ప్రస్తుతం ఉన్న సర్పంచులనే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సంతోష్ పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం

ఏసీసీ, జనవరి 22 : అయోధ్యలో 1992లో నిర్వహించిన కరసేవలో పాల్గొన్న మంచిర్యాల పట్టణంలోని పాతమంచిర్యాలకు చెందిన కరసేవకులను సోమవారం ఘనంగా సన్మానించారు. పాత మంచిర్యాలలోని రామాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రామానుజ దేవదూత జీయర్ స్వామి చేతుల మీదుగా తోట తిరుపతి, బొలిశెట్టి కిషన్, రామగిరి తిరుపతి, హన్మంతు, బొలిశెట్టి లక్ష్మణ్,తూముల శ్రీనివాస్, రాజమల్లు, రవి, బొలిశెట్టి లచ్చన్నలను సన్మానించి అభినందించారు.

రాహుల్‌గాంధీ న్యాయ యాత్రపై దాడికి నిరసన

మందమర్రిటౌన్, జనవరి 22 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రపై అస్సాం సీఎం అండతో బీజేపీ కార్యకర్తలు చేసిన దాడిని వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపం నుంచి అంబేద్కర్ విగ్రహంవరకు ర్యాలీ నిర్వహించారు.మందమర్రికి చెందిన మహంత్ అర్జున్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ చేస్తున్న యాత్రను అడ్డుకుంటూ దాడులు చేయించడం సరైంది కాదన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి: కలెక్టర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 22: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్ (టి) మండలకేంద్రానికి చెందిన సలీం తాను జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా నాలుగు సంవత్సరాల నుంచి పనిచేస్తున్నానని మెరిట్ సెలక్షన్ లిస్టులతో అర్హత కలిగిన తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ రికార్డు అసిస్టెంట్‌గా వెంకటరమణ దివ్యాం గుడిన అయిన తాను గుండె జబ్బుకు గురై శస్త్రచికిత్స చేయించుకుని నడవలేని పరిస్థితి ఉందని తనకు ఇంటి స్థలం ఇప్పిం చాలని దరఖాస్తు చేసుకున్నారు. దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ తాను అమ్మఒడి సేవలలో మూడు సంవత్సరాలు పని చేశా నని టెండర్ పూర్తి కావడంతో తనకు పని లేదని, జిల్లా వైద్యశాఖలో ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. వాంకిడికి చెందిన పద్మ పదవ తరగతి చదువుకున్నానని, ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన గైని లక్ష్మి తాను డిగ్రీ పూర్తిచేశానని, కుటుంబపోషణ ఇబ్బందిగా ఉందని తనకు ఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజే శారు. నేషనల్ హైవే నాలుగు వరుసల రోడ్డుపై రాంగ్‌రూట్‌లను వెంటనే తొలగించాలని ఆసిఫాబాద్‌కు చెందిన జామియాత్ యూత్‌క్లబ్ సభ్యులు కీజర్ మున్వర్‌ఖాన్ విన్నవించారు. రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన అమ్మక్క తన పేరిట గ్రామశివారులో ఉన్న భూమిని తనకు, తన కోడలుకు సమానవాటా చేస్తూ పట్టాచేసి ఇవ్వాలని దరఖాస్తు అందజేశారు.

మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, జనవరి 22: రాష్ట్రంలో మెడికల్ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని టీఎంఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్‌సెక్రెటరీ శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజు అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్ ఇవ్వానలి, ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, 18 నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఉపేందర్, అధ్యక్షురాలుగా సరోజ, ఉపాధ్యక్షులుగా సుజాత, సుష్మా, ప్రధానకార్యదర్శిగా రేణు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా ఫ్లోరెన్సీ, సలహాదారులుగా వందన, వేరునికను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, ఉపేందర్, మల్లేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

బెజ్జూరు, జనవరి 22: ఈనెల 24న బుధవారం మండల కేంద్రంలో కుమరం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆదివాసీ జేఏసీ ప్రధానకార్యదర్శి కోర్తె తిరుపతి అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాణయ్య వెంకట్‌రావు, రాము, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి మిస్సింగ్.. కేసు నమోదు

దహెగాం, జనవరి 22: మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన దిగిడే శంకరయ్య కుమార్తె లావణ్య మిస్సింగ్ అయినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లావణ్య ఈ నెల18 నుంచి కనిపించకుండా పోయిందన్నారు. కుటుంబసభ్యులు బంధువుల, చుట్టుప క్కల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. లావణ్య తండ్రి శంకరయ్య ఇచ్చినఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్న ట్లు తెలిపారు.

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి

చింతలమానేపల్లి, జనవరి 22: యాసంగి పంటవివరాలు నమోదు చేసుకోవాలని ఏవోవిజయ్ అన్నారు. సోమవారం మండలంలోని కర్జవెల్లి, రుద్రాపూర్ గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

నేటి నుంచి ఆత్రం వంశీయుల పెర్సాపెన్ ఉత్సవాలు

సిర్పూర్(యు), జనవరి 22: మండల కేంద్రంలోగల సిర్పూర్‌కార్ ఆత్రం వంశీయుల పెద్దదేవుడి గుట్టలో మంగళవారం నుంచి సిర్పూర్‌కార్ ఆత్రం వంశీయుల పెర్సాపెన్ ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆత్రం వంశీయుల కటోడ(కులగురువు) ఆత్రం లింబారావు తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, జనవరి 22: మండలంలోని తేజిగూడలో మహాత్మజ్యోతిబాపూలే విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పెంటయ్య, సరండి సర్పంచ్ కమలాకర్, గ్రామపటేల్ రాంచందర్, మాలి సంఘం జిల్లాఅధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ టికెటు స్థానికులకే కేటాయించాలి

జైనూర్, జనవరి 22: ఆదిలాబాద్ ఎంపీ టికెటు ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా అభ్యర్థులకే కేటాయించాలని బీజేపీ కుమరంభీం జిల్లా నాయకుడు ఆత్రం భీంరావ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ఆదివాసీ నాయకులకు మాత్రమే ఎంపీ టికెటు ఇవ్వాలన్నారు. ఆదివాసీ నాయకులను పక్కనబెట్టి లంబాడా నాయకులకు ఎంపీ టికెట్టు ఇస్తే జిల్లావ్యాప్తంగా ఆదివా సులను సంఘటితం చేసి ధర్నా, రాస్తారోకోలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దౌలత్‌రావ్, ధర్మేందర్, సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తాపడి.. ఒకరు మృతి

రెబ్బెన, జనవరి 22: మండలంలో ఖైరిగాం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. బోరువేసే లారీ కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న క్రమంలో డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి డివైడర్‌ను ఢీకొట్టడంతో వాహనం పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కేబిన్‌లో ఉన్న ఒకరు మృతిచెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ నరేందర్, ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

తాండూర్, జనవరి 22: ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి కోరారు. సోమవారం మండల కమిటీ ఎన్నిక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. మండల అధ్యక్షుడిగా దేవదాస్, ఉపాధ్యక్షుడిగా గోపి, ఉపాధ్యక్షురాలుగా కళావతి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా గడ్డం సంపత్‌లను ఎన్నుకున్నారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జై శ్రీరామ్...



మంచిర్యాల జడ్పీ పాఠశాల మైదానంలో సీతారాముల కల్యాణం, హాజరైన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు

- వాడవాడల ఆధ్యాత్మిక శోభ...
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు
- శ్రీరామనామ జపాలు.. అన్నదానాలు, పల్లకి సేవలు

అయోధ్యలో రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం వాడవాడల ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.. కాషాయ కండువాలు, దుస్తులు, తలపాగలు ధరించి చిన్నారులు నుంచి పెద్దల వరకు ఆనందోత్సవాల నడుమ శోభాయాత్రలను నిర్వహించారు. వీధుల్లో, ఆలయాల్లో శ్రీరామ నామ స్మరణతో మారుమోగింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ కమిటీలు అన్నదానాలు నిర్వహించారు. ఆలయాలు, ఇళ్ల ఎదుట దీపాల అలంకరణ చేశారు.



నస్పూర్ కాలనీ అంజనేయస్వామి ఆలయంలో పాల్గొన్న భక్తులు

ఏసీసీ, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు పండుగలా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి కల్యాణాన్ని తిలకించారు. పాత మంచిర్యాల రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండగగా నిర్వహించారు. దేవదూత చినజీయర్ స్వామి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వారి ప్రవచనాలు వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యేనడిపెల్లి దివాకర్‌రావు, విజిత్‌రావు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్‌లు పాల్గొని పూజలు చేశారు. గౌతమినగర్‌లోని కోదండ రామాలయం, మేదరివాడ, పాత గర్మిళ్లలోని హనుమాన్ ఆలయాలు ఏసీసీ సమీపంలోని రామాలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖల ఆధ్వర్యంలో సుదర్శన నారసింహ సహిత విశ్వశాంతి రామయణ మహాయాగం సోమవారం ముగిసింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే దంపతులు యజ్ఞం నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండగగా సాగింది. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని ప్రజలు తరలి వచ్చారు. తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన నిర్వహించారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్రలను ఘనంగా నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుంచి ప్రారంభించిన శోభాయాత్రలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. సీతారామలక్ష్మణ, హనుమాన్ వేషధారణలో పిల్లలు, పెద్దలు ఆకట్టుకున్నారు. ఐబీలో ఉన్న భారీ హనుమాన్ విగ్రహానికి క్రేన్ సహాయంతో పూల మాలలు వేశారు. శోభాయాత్ర ఓవర్ బ్రిడ్జి, మంచిర్యాల చౌక్, మార్కెట్ రోడ్డు మీదుగా జెడ్పీ బాలుర పాఠశాల మైదానంకు చేరుకుంది.

నస్పూర్: పట్టణంలోని అంజనేయ స్వామి, కోదండ రామాలయం, సీతారాముల ఆలయ కమిటీలు ప్రత్యేక పూజలు నిర్వహించాయి. ఊరు నస్పూర్‌లో పురాతన కోదండరామాలయంలో పూజలు జరిగాయి. నస్పూర్ గేట్ నుంచి ఉత్సవ విగ్రహాలతో మహిళల కోలాటం, చిన్నారుల నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. అర్చకులు రంజిత్‌శర్మ, మారుపాక ఫణికు మార్ శర్మలు పాల్గొన్నారు. సీసీసీ, తీగల్‌పహాడ్, కృష్ణాకాలనీ, శ్రీరాంపూర్ కాలనీల్లో ఆల యాల్లో ప్రత్యేక పూజల జరిగాయి.

మందమర్రి టౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మందమర్రిలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలను నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు పంచముఖ ఆలయం, యాపల్‌లోని ఆంజ నేయ స్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద కల్యాణ వేడుకలను నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దంపతులు నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు పాల్గొన్నారు. స్థానిక మూడో జోన్ సీతారాముల ఆలయంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. పంచముఖ ఆలయంలో పూజలకు సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, మున్సిపల్ కమి షనర్ రాజులు హాజరయ్యారు. మార్కెట్ సెంటర్లో హిందూ ఉత్సవ కమిటీతోపాటు రామకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. పలు కాలనీల్లో జైశ్రీరాంతో పాటు రాముడి చిత్రపటాలతో ముగ్గులు వేశారు. వివిధ రంగులతో ఆకర్షనీయంగా రాముడు, సీత చిత్రాలు వేయడంతో పలువురు ఆ ముగ్గులను ఆసక్తిగా తిలకించారు. మందమర్రి బాలాజీ స్వీట్ హౌజ్ నిర్వాహకులు బాలాజీ లడ్డూలు పంపిణీ చేశారు.

కల సాకారమైంది

ఎన్నోఏళ్ల కల సాకారమైందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నల్లాల భాగ్య లక్ష్మీ ఓదెలు దంప తులు పేర్కొ న్నారు. పలు ఆలయా ల్లో పూజ లో పాల్గొన్నారు. శ్రీరాముని చరిత్ర గొప్పదని, అయోధ్యలో ఆలయాన్ని అద్భుతంగా నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారన్నారు. పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో వేద పండితులు అనంతచార్యులు, నర్సింహ చార్యులు మార్కెట్ ఆలయంలో సునీల్ శర్మలు పూజలు చేశారు.

జైపూర్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో చేపట్టిన సీతారాముల పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దండేపల్లి: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఊరురా శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహరతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయాలో శ్రీరామ సంకీర్తనతో భజనలు నిర్వహించారు. ఆలయాల వద్ద అన్న దానం ఏర్పా టు చేశారు.

పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన సలీం నుదుట తిలకం ధరించి కాషాయం జెండా పట్టుకొని గ్రామంలో గడప గడపకు తిరుగుతూ హిందూ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను హిందువులు అభినందించారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని నినాదంతో సలీం ముందుకు సాగారు.

జన్నారం: మండలంలోని పలు ఆలయాల్లో శ్రీరామ నామస్మరణతో మార్మోగిపోయాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠించారు. మేదరి వాడ హనుమాన్ మందిర్‌తోపాటు రాంపూర్ ,కిష్టాపూర్, బాదంపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

కాసిపేట: మండలంలోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. గ్రామాలు రామనామస్మరణతో మార్మోగిపోయాయి.

మందమర్రిరూరల్: అందుగులపేటలోని కొరెగట్టు భక్తాంజనేయ స్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఆలయ చైర్మన్ గోపాల్, నాయకులు అశోక్, శివ, సంతోష్, పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని కిష్టంపేట, ఒత్కులపల్లి, సుద్దాల, అస్నాద తదితర గ్రామాల్లో రామచంద్రస్వామి ఆలయం, హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సుద్దాలలో అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను స్ర్కీన్‌పై భక్తులు తిలకిం చారు. ఆయా గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. చెన్నూరు పట్టణంలో మహిళలు ముగ్గులు వేసి అలరించారు. అయోధ్య రామ మందిరం ముగ్గు వేసి భక్తిని చాటుకున్నారు.

నెన్నెల: నెన్నెల, మైలారం, నందులపల్లి, ఆవడం గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. నెన్నెలలో సర్పంచ్ తోట సుజాత- శ్రీనివాస్ ఆధ్వర్యంలో కల్యా ణం నిర్వహించారు. అయోధ్య ఆలయ ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. తీర్థ ప్రసాదాలు, అన్నదాన వితరణ చేశారు. శోభాయాత్ర లు నిర్వహించారు. ఎంపీటీసీలు బొమ్మెన హరీష్‌గౌడ్, పురంశెట్టి తిరుపతి, ఉప సర్పంచ్ అంజన్న, నందుల పల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, సర్పం చ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న హనుమాన్, తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు.

కన్నెపల్లి: మండలంలోని హనుమాన్, వెంకటేశ్వరాయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. రంగు రంగుల ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు.

తాండూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కిష్టంపేట హనుమాన్ ఆలయం నుంచి యువకులు భక్తులు తాండూర్‌లోని శివాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

రామకృష్ణాపూర్: కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాములను దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదానం చేశారు. వేద పండితులు రామకృష్ణ చక్రి, రాజేందర్, సురేష్, వేణు, రవి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంతోపాటు గ్రామాల్లో రామనామం మార్మోగింది. పట్టణంలోని కోదండ రామాలయంలో, కెమికల్ ఆంజనేయ స్వామి ఆలయంలో, రైల్వే స్టేషన్ ఏరియాలోని కోదండ రామాలయంలో, పంచముఖ హనుమాన్ ఆలయం, గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరాముని విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు. పట్టణంలోని కోదండరామాలయం ఆవరణలో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు ప్రొజెక్టర్ స్ర్కీన్ ఏర్పాటు చేశారు.

భీమారం: మండలంలోని కోదండరామాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ విశ్వంభర్, అర్చకులు తిరునంగిరి ప్రవీణ్ పాల్గొన్నారు.



ఐబీ చౌరస్తాలో శోభాయాత్ర



మంచిర్యాలలో కల్యాణానికి హాజరైన భక్తులు



మంచిర్యాలలో శోభాయాత్ర



మందమర్రిలో సీతారాముడి చిత్రంతో ముగ్గు



మ్యాదరిపేటలో భక్తుల శోభాయాత్ర



మందమర్రిలో జడ్పీ చైర్ పర్సన్ దంపతుల పూజలు



నస్పూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బెల్లంపల్లిలో భక్తుల పూజలు

వేంపల్లిలో ఇసుక రీచ్ ప్రారంభం



ఇసుక రీచ్ వద్ద ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

హాజీపూర్, జనవరి 22: వేంపల్లి గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను సోమవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ నిర్మాణ అవసరాలకు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అక్రమ ఇసుక తరలింపును అడ్డుకునేందుకు రీచ్‌ను ప్రారంభించామన్నారు. గతంలో ఉన్న ఇసుక రేట్ల కంటే ఈసారి తగ్గించామన్నారు. బుకింగ్ లేకుండా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. మైనింగ్ ఏడీ బాలునాయక్, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ, సర్పంచు ఓలపు శారద, కార్యదర్శి ప్రతిభ, ఎంపీటీసీలు డేగ బాపు, బాలరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, నాయకులు శ్రీనివాసరావు, ఒడ్డె శ్రీనివాస్, చింతపండు శ్రీను, సురేందర్, సతీష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్ష విరమణ

నస్పూర్, జనవరి 22: నస్పూర్ మున్సిపాలిటీలో హక్కుల సాధనకు కార్మికులు ఐదు రోజులుగా చేస్తున్న రిలే నిరహార దీక్షను సోమవారం విరమించారు. కార్మికులకు చెల్లించాలి ఈపీఎఫ్ డబ్బులు, కొత్తగా చేరిన కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో చేర్చాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, ప్రతీ నెల 1న వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో కార్మికులు దీక్షకు దిగారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారని కార్మిక సంఘం అధ్యక్షుడు కొయ్యల వెంకటి తెలిపారు. ఎమ్మెల్యే కార్మికుల దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులకు నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు.

చదువుతోనే గుర్తింపు

హాజీపూర్, జనవరి 22 : చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంఈవో పోచయ్య అన్నారు. సోమవారం నర్సింగాపూర్‌లోని బుగ్గగట్టు వద్ద ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు చదువుపై అవగాహన కల్పించారు. బడీడు పిల్లలు బడిలో ఉండాలని, పనిలోకి పంపించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఇటుక బట్టీ వద్ద పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని, పిల్లలందరికి పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడీడు పిల్లలను పనులకు పంపిస్తే తల్లిదండ్రులతో పాటు ఇటుక బట్టీల యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. ముస్కాన్ ఆపరేషన్ ఎస్ఐ విజయ్, సిబ్బంది, ఇటుక బట్టీల యజమానులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి

జైపూర్, జనవరి 22: పెగడపల్లి గ్రామంలో చేపడుతున్న ఈదులవాగు బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బ్రిడ్జి పనులను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తుండాలని సూచించారు. అనంతరం పెగడపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మద్దుల సత్యనారాయణరెడ్డి తల్లి మృతి చెందగా ఆయనను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సిద్దం చంద్రయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, జైనుద్దీన్, సుంకరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే

పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

భీమారం: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొ న్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరి షత్ సెకండరీ పాఠశాల ఆవరణలో మం డల రీసోర్స్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా రూ.31 లక్షలతో ఏర్పాటుచేసిన మండల విద్యావ నరుల కేంద్రాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పలువురు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. డీఈవో యాదయ్య, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, జెడ్పీటీసీ భుక్య తిరుమల, సర్పంచు గద్దె రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, రవి, లక్ష్మణ్, ప్రధానో పాధ్యాయుడు విక్రమ్, పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం

చెన్నూరు: క్రీడలతో దేహదారుఢ్యం పెరుగుతుందని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఎమ్మెల్యే హాజరై గెలుపొందిన ఆదర్శనగర్ ఎలవెన్ జట్టుకు రూ.15 వేల నగదు, ట్రోఫీ, రన్నర్ అటాక్ ఎలవెన్ జట్టుకు రూ.10 వేలు, ట్రోఫీ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 22: జిల్లాలో ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్‌సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేడుకల్లో ప్రభుత్వ శాఖల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సాధించిన విజయాలతో ప్రజలకు తెలిసే విధంగా స్టాళ్లను ఏర్పా టు చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల నుంచి అత్యున్నత సేవలు అం దిస్తున్న వారితోపాటు వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సమన్వయంతో జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వేడుకలకు ఏర్పాట్లు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.వివిధ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధిని ప్రదర్శించే విధంగా శకటాలు రూపొందిం చాలని ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ స్వర్ణలత

హాజీపూర్, జనవరి 22: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అభివృద్ధి ప్రణాళికపై సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మందపల్లి స్వర్ణలత అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి రూ.23.78 లక్షల నిధుల విడుదలకు ఆమోదం తెలిపినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ నిధుల్లో 60 శాతం పారిశుధ్యం, తాగునీటి కోసం కేటాయిస్తామని, 40 శాతం గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కేటాయిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నిధులను వినియోగించుకుని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఏయే పనులు చేయాల్సి ఉందో సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీపీ, ఎంపీడీవోల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో ఎంఏ హై, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో మల్లయ్య, ఏపీఎం రాజన్న, పశువైద్యాధికారులు సరిత, శాంతిరేఖ, వైద్యాధికారిణి హరిణి, వ్యవసాయాధికారిణి రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోస్టుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 22 : జాతీయ ఆరోగ్య మిషన్ కింద మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామనిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుబ్బారాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల కోసం ఎంబీబీఎస్/ బీఏఎంఎస్/ బీఎస్సీ నర్సింగ్/ జీఎన్ఎం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎంఎన్ అభ్యర్థులు 2020 సంవత్సరం కంటే ముందు ఉత్తీర్ణులై 6 నెలల కమ్యూనిటీ హెల్త్ బ్రిడ్జి కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం మంచిర్యాల్.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతోపాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లను జత చేసి ఈనెల 23 నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.